# జౌరా!

"బుద్ధి లేదూ? నీకు అక్కలూ చెల్లెళ్ళూ లేరూ?" టకటక శబ్దం చేస్తున్న టైపురైటర్లు ఒక్కమారుగా మూగవోయాయి.

ఫైళ్ళతో కుస్తీలు పడుతున్న గుమస్తాల చేతుల్లోని కలాలు జారిపడ్డాయి.

హెడ్ గుమాస్తా పార్వతీశంగారి కళ్ళజోడు జారిపోయింది. ఆయన కళ్ళజోడు పెట్టుకుంటూ శైలజ టెబిల్‌వంక చూశారు. శైలజ అపరకాళికాదేవిలా కన్పించింది. ఆమెకు దగ్గరలో రామచంద్రమూర్తి నిల్చుని ఉన్నాడు. అతని ముఖం భూమిలోనికి దించుకుపోయింది.

పార్వతీశం వయసు ఏభైయ్యో పడిలో పడింది. పాతిక సంవత్సరాలకు పైబడే సర్వీస్‌ఉంది. ఒక్కొక్క ఆఫీసులో, ఒక్కొక్క చిత్రం, ఒక్కొక్క దృశ్యం అందులోని ఒక్కొక్క సన్నివేశం అతని మనోపథంలో చెరగని ముద్రలు వేసుకున్నాయి. ఈ దృశ్యం - ఈ సన్నివేశం అతని ఊహకందలేదు. కారణం అలా విరుచుకుపడింది శైలజ. ఆమె కోపాగ్నికి గురియైనవాడు వేరెవరో కాదు, రామచంద్రమూర్తి.

అప్పటికే గుమస్తాలందరూ తమ తమ సీట్లలో కూర్చోనో లేదా నిల్చునో చిత్రవిచిత్రంగా చూస్తున్నారు. అందరి కళ్ళలోనూ ఉత్కంఠ, అందరి మనసులలోనూ ఉద్వేగం. ప్రళయం సంభవించినా వారంతగా ఆశ్చర్యపడేవారు కాదు. ఏమంటే అది దైవికం. అది సంభవించే అవకాశాలు ఉన్నాయి. కాని రామచంద్రమూర్తి మీద శైలజ విరుచుకుపడిందంటే ఆరు నూరైనట్లే. రామచంద్రమూర్తికి అంతమంచిపేరుంది మరి.

రామచంద్రమూర్తి ఒకరిజోలికీ శొంఠికీ పోయే వాడు కాదు. చురుకైనవాడే కాదు, బుద్ధిమంతుడు కూడాను. అతను శైలజతో అసభ్యంగా ప్రవర్తించాడా?

కొందరు రామచంద్రమూర్తి అలాంటివాడు కాదనుకొన్నారు.

మరికొందరు ఏ పుట్టల్లో ఏ పాముందో ఎలా తెలుస్తుంది? చాపకింద నీరులా ఉన్నా ఇతనూ గ్రంథసాంగుడేనన్న మాట అనుకున్నారు.

ఏదో అనో, చేసో ఉంటాడు - లేకపోతే శైలజ అలా ఎందుకు విరుచుకుపడుతుంది?

ఏంతైనా ఇంత సాహసమా? ఇంతమంది మనుషులు చుట్టూఉన్నారన్న భయమైనా లేకపోయిందా అతనికి?

కొందరికి అనుమానంగా ఉంది. కొందరికి వింతగా ఉంది.

కొందరు ఇది కలా నిజమా తేల్చుకోలేక బాధపడుతున్నారు.

'ఏదో అన్నాడే అనుకో. అంత మాత్రాన ఇలా ఝాన్సీలక్ష్మీబాయిలా విజృంభించాలా? నష్టపోయేది ఆమేగా! ఆమె పరువే నేలపాలౌతుంది'

మగవాళ్ళు ఇలా ఊహాగానాలు చేస్తూ ఉంటే స్త్రీ ఉద్యోగులు కూడా తలో విధంగా తలపోసుకోసాగారు.

బాగా బుద్ధి చెప్పింది. దీనితో ఆ ప్రబుద్ధులకు బుద్ధి వస్తుంది అనుకున్నవారే అధికం.

అయ్యో! ఈ విధంగా గడ్డిపెట్టింది ఆ అరుణకుమార్ కైతే ఎంత బాగుండును?

సీతకు ఈ సంఘటన సంతోషాన్ని కలిగించింది. అయ్యో! అరుణ్‌కుమార్‌కైతే ఇంకెంత బాగుండేది అనుకుంది. రామచంద్రమూర్తి అలా అసభ్యంగా ప్రవర్తించి ఉంటాడంటే నమ్మలేకపోయింది. ఏనాడూ అతను తనతో పల్లెత్తు మాటలాడలేదు. కన్నెత్తి చూడలేదు. అందరిలా అసభ్యంగా ప్రవర్తించడంలేదు. మరి శైలజతో ఏమన్నాడు- ఎందుకన్నాడు?

సీతకు ఒకందుకు సంతోషంగా ఉంది. తను తెగించలేకపోయింది. శైలజ ధైర్యాన్ని ప్రదర్శించింది.

శైలజ తనతో లోగడ చాలామార్లు అంది. "సీతా! అలా వాళ్ళ కారుకూతలు వింటూ ఎలా స్తబ్దంగా ఉండగలుగుతున్నావు? చెప్పుచ్చుకొని ఎడాపెడా వాయించు. ఆ తరువాత కంప్లెయింట్ చెయ్యి" అని సలహా ఇచ్చింది.

తనను ఎవరేమన్నా లోలోన కుమిలిపోయేది కాని ఎదిరించి నిలవలేకపోయింది. అరటాకూ ముల్లూ సామెత తనకు తెలుసు. ఎలాగైనా నష్టపోయేది తనే. ఈ ఉద్యోగమే తనకు తన కుటుంబానికి జీవనాధారం. దాన్ని తాను వదులుకోలేదు.

"సారీ' అంటూ రామచంద్రమూర్తి తన సీటు లోనికి వెళ్ళిపోయి ఏమీ జరగనట్లు ఫైలుని చూడసాగాడు. అయితే అతని ముఖమండలంమీద విషాదపు జాడలున్నాయి. నిగ్రహం అంటే అతనిదే అనుకున్నారు సహోద్యోగులు.

పార్వతీశంగారు రామచంద్రం అక్కడ నుంచి నిష్క్రమించగానే శైలజ దగ్గరకు వచ్చారు. ఆమె దుఃఖిస్తున్నదో, కోపంతో మండిపడుతున్నదో అతనికి అర్థంకాలేదు. కన్నుల నుండి నీటిబొట్లు కారుతున్నాయి. ముఖం కందగడ్డలా ఎఱ్ఱగా కందిపోయి ఉంది.

"శైలజా! ఏం జరిగింది? రామచంద్రం అలాంటివాడు కాదే" అన్నారు.

శైలజ అతనివంక బాధగా చూసింది. 'అయితే నేనే అతడ్ని నలుగురిలో నవ్వులపాలు

చేయాలని అభాండాలు వేస్తున్నాననా మీ అభిప్రాయం' అన్నట్లున్నాయి ఆ చూపులు.

"అబ్బే నేను అతడి చర్యను సమర్ధించడం లేదు. శైలజా ఈ విషయాన్ని మనసులో ఉంచుకొని అతనిమీద కంప్లయింట్‌చేయకు. అతడ్ని క్షమించు" అన్నారు.

"సర్! ఇది మీ కంటికి చిన్నవిషయంగా కనిపిస్తున్నదా? ఆడవాళ్ళంటే వీళ్ళకింత చులకనా? మేం ఇక్కడ ఒళ్ళు అమ్ముకుందికి రాలేదే?" అంది కళ్ళను ఒత్తుకుంటూ.

పార్వతీశానికి మతిపోయింది.

ఒకవంక ఒక అబలపై తన ప్రత్యక్షంలోనే ఏదో అపచారం జరిగింది. అయితే ఆ అభియోగం ఒక యోగ్యుడిపై మోపబడింది. రామచంద్రం అలా ప్రవర్తించి ఉంటాడంటే అతని మనస్సు అంగీకరించనంటూంది. శైలజకు అబద్ధం ఆడవలసిన అవసరం మాత్రం ఎందుకుంది?

ఆడపిల్లలు ఉద్యోగాలలో చేరిన తరువాత ఇలాంటి సంఘటనలు చెదురుమదురుగా జరుగుతున్నాయి. కొన్నిటిని తను చూసిచూడనట్లు తప్పించుకుంటున్నాడు. కొందరిని చాటుగా పిలిచి వారిస్తున్నాడు.

కొంద రాడపిల్లలు ఈ అవమానాలు భరించలేక ఉద్యోగాలను వదులుకుంటున్నారు. ఈ దురంతాలు అంతమొందాలంటే స్త్రీల సహకారం కావాలి. ఎవరూ తెగించలేకపోతున్నారు. ఈ ప్రబుద్ధులమీద గట్టి చర్యలు తీసుకోకపోతే ఇంకా విజృంభిస్తారు. ఇప్పుడు మంచి అవకాశం చిక్కింది. శైలజ రిపోర్టు ఇస్తే రామచంద్రం మీద చర్య తీసుకోవచ్చు. కాని రామచంద్రంమీదనా చర్య తీసుకోవడం?

"రామం! ఆమె నిజంగా కంప్లైంటు ఇస్తుందంటావా? విశ్వనాథం ప్రశ్నించాడు.

"వింటున్నావుగా ఆమె మాటలు."

"అసలేం జరిగింది?"

"విశ్వం అందుకే నాకు బాధగా ఉంది. నేను ఒక ఫైలుకోసం ఆమె దగ్గరకు వెళ్ళాను. ఆమెతో నేను మాటలాడనే లేదు. మరెందుకామె అలా నామీద విరుచుకుపడిందో?" అన్నాడు రామచంద్రమూర్తి.

"ఆ మాట ఆమెనే అడగలేకపోయావా?'"

"అడగాలనే అనుకున్నాను. శివమెత్తిన ఆమె అవతారాన్ని చూసి మరింత గొడవ జరుగుతుంది తప్పితే మరో ప్రయోజనం ఉండదని ఊరుకున్నాను" అన్నాడు రామచంద్రమూర్తి.

"మరి నీలో దోషం లేనప్పుడు ఆమె కంప్లైంట్ చేసినంత మాత్రాన నీకేం నష్టం? మేమంతా లేమూ?" అన్నాడు విశ్వనాథం.

"లాభం లేదు విశ్వం. ఇలాంటిచోట వాళ్లమాటే నెగ్గుతుంది. మనలో ఎలాంటి కల్మషం లేకున్నా తప్పుమనదే నంటారు. ఏ ఆడపిల్లా ఇలాంటి అభాండాలు ఊరికే వేయదంటారు" అన్నాడు రామచంద్రమూర్తి.

"అయితే నేరం చేయకపోయినా శిక్ష అనుభవించాలా? ఆమెకు మాత్రం సాక్ష్యం ఏదీ?"

" పరిస్థితి జన్యసాక్ష్యం ఆమె పక్షంలో ఉంది. అసలు జరిగిందేమిటో ప్రత్యక్షంగా వీక్షించిన సాక్షులు లేకపోయినా అప్పుడామె టేబిల్ దగ్గర నేనున్నాను. ఆమె నీకు అక్కలూ, చెల్లెళ్ళూ లేరా అంటూ అరవడం అందరూ విన్నారు. మరి ఇంతకంటే కావలసిన సాక్ష్యం ఏముంటుంది? అది చాలు నామీద చర్య తీసుకోవడానికి" అన్నాడు.

"రామం! నువ్వేదో దాస్తున్నావు. అసలు ఏం జరిగింది? ఉత్తపుణ్యానికి శైలజ అలా ప్రవర్తించిందంటే నమ్మశక్యంగాలేదు" అన్నాడు విశ్వనాథం.

"చూశావా విశ్వం! నేను నిజంచెప్తున్నా నువ్వు విశ్వసించలేకపోతున్నావు. నువ్వు నా ఆప్తమిత్రుడివి. నీకే నా మాటల మీద నమ్మకం కలగడంలేదు ఔనా!"

"ఏమిటో రామం! ఈ రోజు నువ్వు లేచిన వేళ మంచిది కాదు. అయినా నువ్వేం భయపడకు నీ మీద ఈగ వాలనీయం" అన్నాడు.

అక్కడ గుమికూడినవారిలో చాలామంది విశ్వంతో ఏకీభవించారు.

"ఈ రోజుల్లో ఉద్యోగాలు దొరకడమే అంతంతమాత్రం ఈ ఉద్యోగంపోతే మేం నడివీధిలో పడతాం" రామం ఈ మాటలు ఎవరినీ ఉద్దేశించి అనలేదు.

"రామం! మరీ అంత దిగులెందుకు? నీ మీద నేరం ఋజువు అవాలిగా! అయినా ఈ నేరానికి నీ ఉద్యోగం పోతుందనుకోను. మహా అయితే సస్పెండు చేస్తారు. ఆ తరువాత ఎంక్వయిరీ ఉంటుంది. ఆమె మాత్రం నీవు అపరాధం చేసినట్లు ఎలా ఋజువు చేయగలుగుతుంది?" అన్నాడు అరుణ్‌కుమార్.

రామం అతనివంక చూశాడు.

"ఔను, రామం, నువ్వు గాభరాపడకు."

"చాలా థాంక్సు. కాని సస్పెన్షను మాత్రం చిన్న శిక్షా? ఎంక్వయిరీ ఎంతకాలం సాగుతుందో? అంతవరకు అర్ధజీతం మాత్రమే దొరుకుతుంది. ధరలు చూస్తే ఆకాశాన్ని అంటుతున్నాయి. పూర్తిజీతంతోనే నెల గడవడంలేదు" అన్నాడు రామచంద్రమూర్తి.

అవతల ఆడవాళ్ళందరూ శైలజను చుట్టుముట్టారు.

"నేనంత తేలిగ్గా వదిలేస్తానా? ఒక్క అతనేనేమిటీ? ఎవరు పడితే వాళ్ళు ఆడపిల్లల్ని అలుసుచేసి ఆడుకుంటున్నారు. అంత ప్రేమ పొంగిపరవళ్లు తొక్కితే చక్కగా పెళ్ళిచేసుకుని పెళ్ళాంతో దూయెట్లు పాడుకోరాదూ! ఎవరడ్డు వస్తారు?" అంది శైలజ.

"బాగుందోయ్! ఇలాంటి అప్రాచ్యపు పనులకు పెళ్ళికాని బ్రహ్మచారులే పరిమితమా? పెళ్ళై ఇద్దరు ముగ్గురు పిల్లలకు తండ్రులైనా ఒంటరి ఆడది కనిపిస్తే తననొక హీరోననుకుంటాడు. వీళ్ళను ఇలా వదిలేయకూడదు. బాగా బుద్ధి చెప్పాలి. అంతవరకు మనకీ ఆగడాలూ అగచాట్లు తప్పవు. తప్పకుండా కంప్లైంటు ఇయ్యి. మేమంతా నీకు అండగా ఉంటాం" అంది సువర్చల.

* * *

సువర్చలకు పెళ్ళి అయింది. ఒక్కరి సంపాదనతో సంసారం జరక్క ఉద్యోగంలో చేరింది. ఇలాంటి అనుభవాలు కొత్త కాదు.

"ఎవరికెలా చెయ్యాలని ఉంటే అలా చెయ్యండి. ప్రస్తుతానికి ఈ చర్చలు మాని మీ మీ పనులు చూడండి. ఎం.డి.గారు వచ్చే టైం అయింది" అని అందరినీ ఉద్దేశించి అని "శైలజా! ఏదో పెద్దవాడిని చెప్తున్నాను. ఆ తరువాత నీ ఇష్టం" అన్నారు పార్వతీశంగారు.

శైలజ నిజంగా కంప్లైంటు ఇస్తుందా లేక పార్వతీశంగారి కోరికమేరకు ప్రస్తుతానికి ఊరుకుంటుందా అన్న ప్రశ్న అందరి ముఖాలమీద కొట్టవచ్చినట్లు కనుపించింది.

అయితే శైలజ ఎలా ప్రవర్తించి ఉండేదోగాని, అందుకు రామచంద్రమూర్తి అవకాశం ఇవ్వలేదు.

"నేనే రిజైను చేస్తాను. అంతకన్నా మరో మార్గంలేదు" అన్నాడు విశ్వంతో.

"చాలా బాగుంది. ఈ రోజుల్లో ఉద్యోగాలు అంత తేలిగ్గా దొరుకుతున్నాయా? రేపటినుంచి రోడ్లు సర్వే చేయాలనుకుంటున్నావా?" మందలించాడు విశ్వం.

"ఔను రామం! విశ్వం అన్నది యదార్థం. నీవు ఉద్యోగం వదులుకోవడం వంటి మూర్ఖమైన పని మరొకటి ఉండదు. కష్టాలొచ్చినప్పుడే ధైర్యంగా నిలబడాలి" అన్నాడు శాస్త్రి.

"లాభంలేదు శాస్త్రీ. దీని పరిణామం సుఖాంతంకాదు. నేనే నేరం చేయకపోయినా శైలజ నా మీద ఈ కుట్ర ఎందుకు పన్నిందో తెలియడంలేదు. డిపార్టుమెంటువారు నా నేరాన్ని నిరూపించి నన్ను ఉద్యోగంనుంచి తీసివేయడంకన్నా నా అంతట నేనే రాజీనామా ఇవ్వడం ఉభయత్రా శ్రేయస్కరం. నాకూ తృప్తి ఉంటుంది" అన్నాడు రామచంద్రమూర్తి.

అయితే ఈ సంఘటనతో ఆ ఆఫీసులో అనుకోని మార్పులు వచ్చాయి. ఒక వంక హీరోల్లా వ్యవహరించే వాళ్ళు భయపడి తోకలు ముడుచుకుంటే వేరొకవంక ఆడపిల్లల్లో

ధైర్యసాహసాలు కలిగాయి.

రామచంద్రమూర్తి లేకపోవడంతో ఆ ఆఫీసువాతావరణంలో మార్పు వచ్చినా పార్వతీశంగారికి ఒకందుకు సంతోషంగానే ఉంది. రామచంద్రమూర్తిని తనింతకాలం యోగ్యుడనే అనుకున్నాడు. అయితే అతనిలో తప్పు ఉంది కనుకనే గుట్టు చప్పుడవగానే తప్పుకున్నాడు అనుకున్నారు.

నాలుగైదురోజులు ఆఫీసులోనూ కేంటినులోను ధారాళంగా ఈ విషయమై చర్చలు - జరిగినా గాలిదుమారంలా అది అణిగిపోయింది.

◆ ◆ ◆

లంచ్‌టైంలో ఆడవాళ్ళందరూ శైలజ టేబిల్ దగ్గరకు చేరారు. ఇప్పుడామె వాళ్ళకు నాయకురాలు.

"శైలజా! నిన్న ఆఫీసుకి రాలేదు. పెళ్ళి చూపుల ఏర్పాటా?" అంది సువర్చల.

శైలజ ముసిముసిగా నవ్వింది.

"అప్పుడే నీవరకూ వచ్చిందా?"

"పంకజాక్షి మీ పొరుగునేగా ఉంటున్నది. నిన్న సాయంత్రం బజారులో కనిపించి చెప్పింది" అంది సువర్చల.

"పండా కాయా?" అడిగింది సీత.

"అదేం ప్రశ్న! మన శైలజకేం తక్కువ. బి.ఏ. పాసైంది. మంచి ఉద్యోగం ఉంది. చందనం బొమ్మలా ఉంటుంది. ఆమెను కాదనే వాడెవరు? శైలజా! మాకు పప్పన్నాలు ఎప్పుడు?" అంది సువర్చల.

"అదీ ఒక మహాభాగ్యమేనా? రేపు ఎలాగూ సెలవే కదా. అందరూ కలసి రండి.పప్పన్నాలతోపాటు పాయసంకూడా చేయించి పెడతాను" అంది శైలజ నవ్వుతూ.

"శైలజా! నీకంత వేళాకోళంగా ఉందా? సువర్చల అడిగింది మామూలు పప్పన్నాలు కాదు. ఆ వచ్చిన వాళ్ళు నిన్ను నచ్చుకున్నారా? ఆ సంబంధం కుదిరిందా? పెళ్ళెప్పుడు?"

శైలజ చెప్పబోయే జవాబుకోసం పదిజతల చెవులు ఆత్రుతగా ఉన్నాయి.

"ఏం అవతల వాళ్లు నచ్చుకుంటే సరిపోతుందా? మనకంటూ అభిప్రాయాలు ఉండవా? మనం నచ్చుకోవడం ముఖ్యం కాదా?" అంది శైలజ.

"అబ్బో అన్ని ప్రశ్నలే! అసలు ఆడపిల్ల అభిప్రాయాలు ఏ ఇంటిలో చెల్లుతున్నాయి! గుండెలమీద కుంపటిని ఎప్పుడు దింపుకుందామా అని కదూ తల్లిదండ్రుల ఆత్రుత. అయితే

నీ సంగతి నాకు తెలియదు. అసలు విషయం దాటేయకు. నీ మాటలూ చేష్టలబట్టీ ఆ సంబంధం నీకు నచ్చిందనీ వాళ్ళూ ఇష్టపడ్డారని, మాకు పప్పన్నాలు త్వరలోనే ఏర్పాటు చేయిస్తున్నావని అనుకుంటున్నాను. ఇంతకీ వరుడెవరు?" అంది సువర్చల.

"నాకాబోయే భర్త మీ అందరికీ పరిచితుడే" అంది శైలజ.

"ఆశ్చర్యపడకండి. రామచంద్రమూర్తి నా కాబోయే భర్త" అంది శైలజ.

వాళ్ళందరూ శిలాప్రతిమలైపోయారు.

అదెలా సంభవం? అసలతను ఈమె మూలంగానేగా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చింది. ఇప్పుడతను శైలజను చేసుకుందికి అంగీరించాడా- అంత పరాభవాన్ని రుచిచూసి. పోనీ అతను శైలజ అందచందాలను చూసి అంగీకరించినా ఈవిడెలా అంగీకరించింది?

"ఏం రామచంద్రమూర్తి నాకు తగినవాడు కాడా? లేక అతనికే నేను తగనిదానినా? ఎందుకలా నోళ్ళుతెరచి ఆశ్చర్యపోతారు?" అంది శైలజ.

"ఆడవారి మాటలకు అర్థాలేవేరులే అంటే అది పురుషులు చేసే ప్రచారమే అనుకున్నాం. నాకు తెలియక అడుగుతాను - ఆనాడు నీవతన్ని గులపరించావు. అతనిమీద కత్తికట్టి కక్ష సాధించాలనుకున్నావు. అతనూ పరిస్థితులకు తలొగ్గి రిజైనుచేసి వెళ్ళిపోయాడు - ముఖం చెల్లక. మరి అతన్ని నీవెలా వరిస్తున్నావు? ఇప్పుడు నీ కళ్ళకతను పురుషోత్తముడిలా కనుపిస్తున్నాడా?"

శైలజ రెండు క్షణాలు మౌనంగా ఉండిపోయింది.

"నాకు తెలుసు ఈ ప్రశ్న వస్తుందని. కాని నేను మీకో రహస్యం చెప్పదలచుకోలేదు. ఆడవాళ్ళ నోటిలో నువ్వుగింజ నానదంటారు. మీకారహస్యం చెప్తే అది సర్వవ్యాప్తమౌతుంది. దాంతో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది. అయితే ఆ నువ్వు గింజనానదు అన్న సామెత నాకూ సమానంగా వర్తిస్తుంది. ఇంతకాలం నాలో ఎలా దాచగలిగానా అన్నదే ఆశ్చర్యంగా ఉంది" అంటూ ఆగింది.

ఆమె ఏ రహస్యం ఇంతకాలం దాచింది?

"మన ఆఫీసులో కొంతమంది మగరాయుళ్లు ఆడపిల్లను టీజ్‌చెయ్యడం పనిగా పెట్టుకున్నారు. మనలో చాలామంది వాళ్ళ బాధలతో అవమానాలు అనుభవిస్తున్నారన్నది సర్వవిదితమే. అయితే వాళ్ళను ఎదిరించే తెగువ మనలో లేకపోయింది. మీలో ఎందరికో చెప్పాను ఇలా ఉపేక్షించి ప్రయోజనం లేదు. పై అధికారులకు కంప్లైంటు చెయ్యండి అని. ఎవరూ నా మాట వినిపించుకోలేదు. ఎవరి భయం వారిది. దీనివలన అనవసరంగా మనమే

రచ్చకెక్కుతాం అని మీ భయం. ఇలా ఎంతకాలం వాళ్ళ పోకిరీ చేష్టలను భరించడం? అయితే ఏ అరుణ్‌కుమారూ నా జోలికి రావడానికి సాహసించలేదు. ఈ మగధీరులకు భయంకల్పించాలని మన ఆడవాళ్ళలో ధైర్యం కలిగించాలని నేనే ఆనాడు అలా ప్రవర్తించాను. నిజానికి ఆ రామచంద్రమూర్తి నాతో అసభ్యంగా ప్రవర్తించలేదు" అంది.

"అయ్యో! ఎంత పనిచేశావు? దొరక్క దొరక్క అతనే దొరికాడా? ఏం నువ్వా ప్రయోగం ఆ అరుణ్‌కుమార్ మీదే ఎందుకు చెయ్యలేదు?" అంది సువర్చల.

"నిజమే! ఈ ప్రశ్న వస్తుందని నాకు తెలుసు. నేను చెయ్యదలుచుకున్నదల్లా వాళ్ళను భయపెట్టాలని మాత్రమే. ఎవరికీ హానిచెయ్యడం నా ఉద్దేశం కాదు. నీవన్నట్లు అరుణ్‌కుమార్ మీదే ప్రయోగం చేసివుంటే కంప్లైంట్ విధిగా చేసి వుండవలసి వస్తుంది. అప్పుడతని ఉద్యోగానికి ముప్పు వస్తుంది. దానివలన పరోక్షంగా అతని భార్యాపిల్లలకు అపకారం జరుగుతుంది. అదీ సంగతి."

"అలాగని ఒక నిర్దోషిమీద విరుచుకుపడి అతన్ని నిరుద్యోగిని చేశావు. అందుకే ఇప్పుడు పాపపరిహారం చెల్లిస్తున్నావా?" అంది సువర్చల.

శైలజ నవ్వింది.

"లేదు. నేనలా ప్రవర్తించకపోయినా అతను రిజైను చేసేవాడే. అతనికి బేంకులో ప్రొబేషను ఆఫీసరుగా ఆఫర్ వచ్చింది."

"అంటే మీరిద్దరూ ఆలోచించుకునే అలా వ్యవహరించారన్నమాట."

"సువర్చలా! అతను పరాయివాడు కాదు. మా మేనత్త కొడుకు" అంది శైలజ.

"ఔరా!" అనుకున్నారు ఆ ఆడబృందం.

**– ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక, 10.07.1991**